క్లుప్తంగా

నాణ్యమైన ధాన్యం తెచ్చి మద్దతు ధర పొందాలి



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీసీవో

పెగడపల్లి: ప్రభుత్వ రంగ సంస్థలు ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని జిల్లా సహకారశాఖ అధికారి మనోజ్‌కుమార్ రైతులను కోరారు. పెగడపల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సబ్ రిజిస్ట్రార్ మల్లేశంతో కలిసి శుక్రవారం సందర్శించారు. కేంద్రంలో ఏర్పాటు చేసిన వసతులను ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యం కొనుగోళ్లు చేయాలని, తూకం చేసిన బస్తాలు, రైతుల వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సీఈవో గోపాల్‌రెడ్డి, సిబ్బంది హైమద్, అనిల్, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ ప్లాట్లు పరిశీలన



ప్లాట్లను పరిశీలిస్తున్న అధికారులు

ఇబ్రహీంపట్నం: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఎల్‌ఆర్‌ఎస్ ప్లాట్లను అధికారులు పరిశీలించారు. 3 ఏళ్ల క్రితం మండలంలో 274 మంది రెగ్యులరైజేషన్ స్కీం క్రింద ప్లాట్లను క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్నారు. ప్లాట్ల వద్దకు వెళ్లి ప్లాట్ ప్రభుత్వ భూమిదా, ఇరిగేషన్ శాఖకు సంబంధించిందా, నిజమైన పట్టాదారుడిదేనా, పరిశీలించి, అధికారులు అట్టి ప్లాట్లను రెగ్యులరైజేషన్ కోసం ఆమోదిస్తారు. కార్యక్రమంలో ఎంపీవో చంద్రశేఖర్, ఆర్‌ఐ రేవంత్‌రెడ్డి, ఇరిగేషన్ ఏఈ ఇబ్రహీం, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురిలో స్వచ్ఛ సర్వేక్షణ్



డ్రైడే కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారి

ధర్మపురి: అంటు వ్యాధులు, విష జ్వరాలు రాకుండా స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా ధర్మపురి పట్టణంలో శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు వార్డుల్లో డ్రైడే కార్యక్రమాలను చేపట్టారు. ఈసందర్భంగా మురికి నీటి గుంటల్లో నీరు నిలువ ఉండకుండా, ఖాళీ డ్రమ్ముల్లో, కొబ్బరి బొండాలు, కూలర్లు తదితర వాటిల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్, ఆస్పత్రి సిబ్బందికి సూచించారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వాహిని

మల్లాపూర్: సీజనల్ వ్యాధులు, విషజ్వరాలు ప్రబలకుండా విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ అధికారి, మండల వైద్యాధికారి డాక్టర్ వాహిని అన్నారు. శుక్రవారం మల్లాపూర్ మండల కేంద్రంలోని ఎస్టీ మినీ గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థులకు ఆమె వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థులకు ఆరోగ్యసూత్రాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. అనంతరం 28 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి వారి రక్తనమూనాలు సేకరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మీప్రియాంక, స్టాఫ్ నర్సు అరుణ, పీహెచ్‌సీ సీహెచ్‌ఓ రామ్మోహన్, హెల్త్ సూపర్‌వైజర్ ప్రభావతి, ల్యాబ్ టెక్నీషియన్ ఉమాదేవి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉన్నాయంతే..

- పనిచేయని సీసీ కెమెరాలు
- నిర్వహణ లేక చాలా చోట్ల కనుమరుగు
- నేరాల నియంత్రణకు ఏర్పాటు చేయాలంటున్న ప్రజలు



కోరుట్ల- వేములవాడ రోడ్డుపై సిరికొండలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సిన స్థలం

కథలాపూర్: ఒక సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమనేది అందరికీ తెలుసు. ఎన్నో అంతు చిక్కని కేసులను ఈ సీసీ కెమెరా మాత్రమే పరిష్కరించిన సందర్భాలున్నాయి. కానీ దాతల సహకారంతో గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీకెమెరాలు నిర్వహణ సరిగా లేకపోవడంతో అవి పనిచేయడం లేదు.

గతంలో ఊరూరా సీసీ కెమెరాలు...

కథలాపూర్ మండలంలోని 19 గ్రామాల్లో ఐదేళ్ల క్రితం పోలీస్ శాఖ ప్రోత్సాహం.. దాతల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటిని కథలాపూర్ పోలీస్‌స్టేషన్‌కు అనుసంధానించారు. ఐదేళ్ల క్రితం జరిగిన ఎన్నికలు సజావుగా నిర్వహించడానికి సీసీ కెమెరాలు పనిచేశాయని అప్పట్లో అధికారులు ప్రకటించిన సందర్భాలున్నాయి. అలాంటి సీసీ కెమెరాల నిర్వాహణను పట్టించుకునే వారు లేకపోవడంతో అవి ప్రస్తుతం పనిచేయడం లేదు. పలు గ్రామాల్లో కోతులు సీసీ కెమెరాలను ధ్వంసం చేసి వైర్లను కట్ చేశాయని, కొన్ని గ్రామాల్లో అక్రమ వ్యాపారాలు చేసేవారు వాటిని పనిచేయకుండా చేశారనే విమర్శలున్నాయి. అధికారులు సీసీ కెమెరాల పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలించి మరమ్మతులు చేయించాల్సి ఉండగా.. ఏళ్లుగా వాటి గురించి పట్టించుకోకపోవడంతో సీసీ కెమెరాల పరికరాలు అనవాళ్లు లేకుండా పోయాయని ప్రజలు అంటున్నారు. గ్రామాల్లో ఏదైనా ఘటనలు జరిగినప్పుడు వాస్తవాలు తెలుసుకోవడానికి సీసీ కెమెరాలు ఉంటే బాగుండేదని నాయకులు, అధికారులు అంటూ ఆ తర్వాత పట్టించుకోకపోవడంలేదని ప్రజలు పేర్కొంటున్నారు. సీసీ కెమెరాలు ఉంటే వాస్తవం ఏమిటో గ్రామ తెలిసేదని ప్రజలు అంటున్నారు. గ్రామాల్లో పలు ప్రమాదాలు, చోరీలు జరిగినప్పటికీ సీసీ కెమెరాలు లేకపోవడం.. కొన్ని చోట్ల ఉన్న అవి పనిచేయకపోవడంతో వాస్తవాలు తెలియడంలేదని ప్రజలు భావిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు స్పందించి సీసీ కెమెరాలకు మరమ్మతు చేయించాలని, లేదా కొత్త సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

తెలియని ఘటనలు ఎన్నో..

- కథలాపూర్ మండలం తుర్తి గ్రామానికి చెందిన పుల్లె గంగరాజ్యం గత నెల 17న కథలాపూర్‌లోని యూనియన్ బ్యాంకులో రూ. 1.68 లక్షలు డ్రా చేసుకొని తన బైకులో పెట్టుకున్నారు. బ్యాంకు ఎదురుగా ఉన్న బేకరి షాపు వద్ద బైక్ నిలిపి లోపలికి వెళ్లి వచ్చేసరికి అందులోని డబ్బులు మాయమయ్యాయి. డబ్బులు ఎత్తుకెళ్లిన వ్యక్తులు ఎవరో ఇప్పటికీ వెలుగులోకి రాలేదు.
- గత నెల 30న మండలంలోని తాండ్య్రాల ఎక్స్‌రోడ్డు వద్ద అదే గ్రామానికి చెందిన అబ్దుల్ హైమద్ అనే వ్యక్తి బైక్‌ను పార్కింగ్ చేసి వెళ్లారు. కొద్దిసేపటికి బైక్ మాయమైంది. ఈ సంఘటనలో కొన్ని రోజుల తర్వాత బైక్ ఆచూకీ లభించింది.



భూషణరావుపేట శివారులో కూడలి

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

గ్రామాల్లో ప్రధాన రహదారుల్లో, కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే నేరాలను నియంత్రించవచ్చు. సీసీ కెమెరాలు ఉంటే దొంగతనాలకు పాల్పడేవారిని, ప్రమాదాలకు కారణమైనవారిని గుర్తించి బాధితులకు త్వరగా న్యాయం చేసే అవకాశం ఉంటుంది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు చొరవ చూపి గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. పాతవాటికి మరమ్మతులు చేయించాలి.



– కోట శంకర్, సామాజిక కార్యకర్త, కథలాపూర్

అవగాహన కల్పిస్తున్నాం

గ్రామాల్లో దుకాణాల యజమానులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. అనుమానిత వ్యక్తులు వచ్చి దొంగతనానికి పాల్పడితే అందులో రికార్డు అవుతుంది. గ్రామాల్లో కూడళ్లు, గ్రామ శివారుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు గురించి ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి దాతల సహకారంతో ఏర్పాటు చేయాలనుకుంటున్నాం. అందరి సహకారంతో అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలనే లక్ష్యంతో ఉన్నాం.



– నవీన్‌కుమార్, ఎస్సై– కథలాపూర్

పేదల కళ్లలో ఆనందమే ప్రభుత్వ లక్ష్యం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



లబ్ధిదారులతో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

మేడిపల్లి: పేద ప్రజల కళ్లల్లో ఆనందం చూడటమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మేడిపల్లి మండల కేంద్రంలోని ఏఎస్ఆర్ గార్డెన్‌లో 80 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం కొండాపూర్, వల్లంపల్లి, గోవిందారం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. సన్న వడ్లకు వడ్ల వంటల రూపాయల బోనస్ తమ ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. అలాగే కొండాపూర్‌లో ఎరువుల గోదాంను ప్రారంభించారు. కమ్మరిపేటలో పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. గోవిందారం ఒడ్డెర కాలనీని పరిశీలించి పలువురి ఇండ్లు శిథిలావస్థలో ఉన్నందునా వారికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఇందిరా మహిళా శక్తి పథకంలో మహిళలకు ఆర్థిక చేయూత అందిస్తుందని తెలిపారు.

కాటమయ్య కిట్లు పంపిణీ

వెల్గటూర్: గీత కార్మికులకు కల్పతరువు కాటమయ్య కిట్లని ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ అన్నారు. శుక్రవారం ఎండపల్లి మండలం గుల్లకోటలో గీత కార్మికులకు కాటమయ్య కిట్లు పంపిణీ చేశారు. గీత కార్మికుల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

గొల్లపెల్లి: మండలంలోని చిల్వాకోడూర్, లొత్తునూర్ గ్రామాలకు చెందిన కల్లు గీత కార్మికులకు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కాటమయ్య కిట్లను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నిశాంత్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ సంతోష్, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా ఉంటాం

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్



పార్టీ కార్యకర్తలతో ప్రభుత్వ విప్ అడ్లూరి

రాయికల్: కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టత కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. పట్టణంలో ముఖ్య కార్యకర్తలతో శుక్రవారం సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలను గుర్తించి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రతిపాదించారని, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ప్రలోభాలకు లొంగి పార్టీ మారి కాంగ్రెస్‌లో చేరారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల పేర్లు చేర్చాలని విప్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం విప్ మాట్లాడుతూ, కష్టపడ్డ కాంగ్రెస్ కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని, కష్టపడ్డ కార్యకర్తలకు అర్హులందరికీ నామినేటెడ్ పోస్టులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి గుర్రం మహేందర్, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి కొయ్యడి మహిపాల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన

కథలాపూర్: మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న ఎం.మధు అనే విద్యార్థి రాష్ట్రస్థాయి వాలీబాల్ క్రీడలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అనిత శుక్రవారం తెలిపారు. జిల్లాస్థాయి అండర్–17 వాలీబాల్ క్రీడల్లో మధు ప్రతిభ చాటడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి మధును ప్రిన్సిపాల్ అనిత, పీఈటీ రవీందర్, ఉపాధ్యాయులు అభినందించారు.

వీధి కుక్కలు పట్టివేత

మెట్‌పల్లి: వీధి కుక్కల సమస్యపై మున్సిపల్ అధికారులు దృష్టి సారించారు. పట్టణ వీధుల్లో కుక్కల బెడద తీవ్రం కావడంతో వాటిని నియంత్రించాలని ప్రజల నుంచి పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయి. దీంతో శుక్రవారం కుక్కలను పట్టుకునే వారిని రప్పించారు. ఈ సందర్భంగా వారు పలు వీధుల్లో సంచరిస్తున్న 42 కుక్కలను పట్టుకొని ఏబీసీ సెంటర్‌కు తరలించారు.

కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా కార్యవర్గసభ్యుడిగా సురేశ్

మల్లాపూర్: కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ జిల్లా కార్యవర్గసభ్యుడిగా మల్లాపూర్ మండల కేంద్రానికి చెందిన ఉప్పులూటి సురేశ్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు గడ్డం వెంకటేష్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం మల్లాపూర్‌లో ఉప్పులూటి సురేశ్‌కు ప్రభుత్వ విప్, డీసీసీ ప్రెసిడెంట్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కాంగ్రెస్ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు నియామక పత్రం అందజేశారు. తన నియామకానికి సహకరించిన కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు గడ్డం వెంకటేష్‌గౌడ్ నాయకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

అనుమతులు లేని నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని వినతి

రాయికల్: మండలంలోని మైతాపూర్ శివారులోని కుమ్మరిపల్లి సరిహద్దు ప్రాంతంలో, మైతాపూర్ బుడిగజంగాల కాలనీ శివారులో ఎలాంటి అనుమతులు లేకుండా చర్చిల నిర్మాణం చేపట్టి అన్యమత ప్రచారం చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శికి వేణుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాజనాల మధుకుమార్, నాయకులు రాజేందర్, సద్దిమహిపాల్, దేశవేణి శ్రీనివాస్, మెత్కూరి శ్రీనివాస్, స్వామి, వినోద్ పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి

రాయికల్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. శుక్రవారం రాయికల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలలో లెక్చరర్ల విద్యాబోధనను పరిశీలించారు. కళాశాలలో ఇంగ్లిష్ లెక్చరర్‌గా పనిచేస్తున్న రాజేంద్రప్రసాద్ బహూకరించిన మైక్‌సెట్ సిస్టమ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్, లెక్చరర్లు చౌదార్ల శ్రీనివాస్, మనోహర్‌రెడ్డి, రాజమౌళి, దేవేందర్ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ సమస్యలు పరిష్కరించండి

మల్లాపూర్: మోడల్ స్కూల్ సమస్యల పరిష్కారానికి సహకరించాలని ప్రిన్సిపాల్ భూమేశ్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం తహసీల్దార్ వీరేశంగ్, ఎండీవో జగదీష్, ఎంఈవో దామోదర్‌రెడ్డిలను పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా మోడల్ స్కూల్ సమస్యలను పరిష్కరించాలని వారికి వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మోడల్ స్కూల్‌కి వెళ్లే రహదారిలో హైలెవల్ బ్రిడ్జ్ నిర్మాణం చేపట్టాలని, స్కూల్ వరకు బీటీ లేదా సీసీ రోడ్డు నిర్మాణం, పాఠశాలలో కిచెన్ షెడ్ నిర్మాణం, అసంపూర్తి నిర్మాణ పనులను పూర్తి చేయించాలని కోరారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ పీజీటీ, టీజీటీ అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలి

కథలాపూర్: విద్యార్థులు పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని మండల ఆరోగ్య పర్యవేక్షకులు శ్రీధర్ అన్నారు. శుక్రవారం కథలాపూర్ మండలం చింతకుంట, భూషణరావుపేట గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు రక్తహీనత, పౌష్టికాహారం గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, ఆరోగ్యం పట్ల విద్యార్థులు శ్రద్ధ వహించాలన్నారు. పోషకాలు ఎక్కువగా ఉన్న ఆహార పదార్థాలు తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారన్నారు. పలువురు విద్యార్థులకు రక్తపరీక్షలు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రాజేందర్, ఏఎన్ఎం గంగారాణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ తల్లి విగ్రహావిష్కరణ

ఇబ్రహీంపట్నం: మండలంలోని తిమ్మాపూర్‌లో శుక్రవారం ఘనంగా పెద్దమ్మ విగ్రహ ప్రతిష్టాపన విగ్రహావిష్కరణ చేశారు. ముందుగా మదిరాజ్ కులస్తులు పెద్దమ్మ విగ్రహాన్ని పోతరాజుల విన్యాసాలతో గ్రామంలో ఊరేగించారు. అనంతరం కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పెద్దమ్మ విగ్రహ ప్రతిష్టాపనకు భూమిపూజ చేయగా, విగ్రహాన్ని భక్తి శ్రద్ధలతో ప్రతిష్టాపించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సోమల లక్ష్మారెడ్డి, నాయకులు రంజిత్‌రెడ్డి, నర్సయ్య, ముదిరాజ్ కులస్తులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్

అభివృద్ధి పనులు త్వరగా చేపట్టాలి

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల: జగిత్యాల మున్సిపల్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులు త్వరగా చేపట్టాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని పలు వార్డుల్లో రూ.25 లక్షలతో చేపట్టే సీసీరోడ్లు, డ్రైనేజీ పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతీ వార్డులో తాగునీటి పైప్‌లైన్ వేయడం జరిగిందని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా మంచినీరు అందించడం జరుగుతుందన్నారు. అలాగే మరుడు, ఆయాల అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేయడం జరిగిందని చెప్పారు. 15 ఫైనాన్స్, ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా వచ్చిన నిధులు పట్టణ ప్రగతికి ఉపయోగించుకోవాలన్నారు. కాంట్రాక్టర్లకు సైతం వెంటనే బిల్లులు మంజూరు చేయాలన్నారు. డబుల్‌బెడ్‌రూం ఇళ్ల మౌలిక సదుపాయాల పనులు శరవేగంగా జరుగుతున్నాయని, త్వరలోనే అర్హులందరికీ అందుతాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, నాయకులు గిరి నాగభూషణం, కమిషనర్ చిరంజీవి పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న చైర్మన్

రాయికల్: రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్‌చైర్మన్ మోర హన్మండ్లు కోరారు. శుక్రవారం ఏఎంసీ పరిధిలోని కిష్టంపేట, మైతాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. రైతులు దళారుల చేతుల్లో మోసపోకుండా ఉండేందుకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, తహసీల్దార్ ఖయ్యూం, సంఘ డత్తత అధికారిని స్వప్న, సింగిల్ విండో వైస్ చైర్మన్ బేతి మల్లారెడ్డి, కొప్పులు తురగ శ్రీధర్‌రెడ్డి, మహేశ్‌గౌడ్, డైరెక్టర్లు, సీఈవో రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పెగడపల్లి: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని నందగిరి విండో చైర్మన్ భాస్కర్‌రెడ్డి రైతులను కోరారు. పెగడపల్లి మండలంలోని నందగిరి, నామాపూర్, మ్యాకవెంకయ్యపల్లి, ఆయిటిపల్లి గ్రామాల్లో నందగిరి సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు పండించిన ధాన్యం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కిషన్‌రెడ్డి, మాజీ విండో చైర్మన్ నరేందర్‌రెడ్డి, సీఈవో రవీందర్‌రెడ్డి, నాయకులు కరుణాకర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, రమేశ్, రాజు, రామ్‌రెడ్డి, సురేశ్, రైతులు పాల్గొన్నారు.

గొల్లపెల్లి: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో చైర్మన్ రాజ సుమన్‌రావ్, మార్కెట్ చైర్మన్ సంతోష్ ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ తిరుపతి, కాంగ్రెస్ నాయకులు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

బీడీ కార్మిక మహాసభను జయప్రదం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న భూమేశ్వర్, నాయకులు

జగిత్యాలటౌన్: శనివారం జగిత్యాల జిల్లా మల్యాలలో జరిగే బీడీ కార్మికుల మహాసభను జయప్రదం చేయాల్సిందిగా ఏఐటీయూసీ(బీడీ కార్మిక విభాగం) జిల్లా నాయకుడు ఇరుగురాల భూమేశ్వర్ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో మహాసభ పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. బీడీ కార్మికుల సమస్యల పరిష్కారానికి పలు డిమాండ్లతో నిర్వహిస్తున్న మహాసభకు బీడీ కార్మికులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు శనిగరపు ప్రవీణ్, శ్రీగాద దేవదాసు, వెన్న మహేశ్, రాచర్ల సురేశ్ పాల్గొన్నారు.

మల్యాల: మండల కేంద్రంలో శనివారం నిర్వహించే బీడీ కార్మిక సంఘం జిల్లా మహాసభను విజయవంతం చేయాలని బీడీ కార్మిక సంఘం అధ్యక్షురాలు కొమ్ముల కాంత, కార్యదర్శి సుతారి రాములు అన్నారు. ఏఐటీయూసీ బీడీ కార్మిక సంఘం జిల్లా మహాసభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీడీ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చిన్న విశ్వనాథం, ఎండీ.ముఖ్రం, గంగాధర్ పాల్గొన్నారు.

పెగడపల్లి: మల్యాలలో శనివారం జరిగే 6వ జిల్లా బీడీ కార్మికుల మహాసభలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఇరుగురాల భూమేశ్వర్ అన్నారు. మహాసభ కరపత్రాలు శుక్రవారం పెగడపల్లిలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు శనిగరపు ప్రవీణ్, గాద దేవదాస్, వెన్న మహేశ్, రాచర్ల సురేశ్, బీడీ కార్మికులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఎన్‌ఆర్ఐ పాలసీ కింద మూడు కుటుంబాలు ఎంపిక

సారంగాపూర్: గల్ఫ్‌లో మృతిచెందిన బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం తీసుకవచ్చిన ఎన్ఆర్ఐ పాలసీ కింద రూ. 5 లక్షల పరిహారం చెల్లింపు కోసం బీర్‌పూర్ మండలం నుంచి మూడు కుటుంబాలు ఎంపికైనట్లు డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. కొల్వాయిలో ఒక కుటుంబం, నర్సింహులపల్లెలో రెండు కుటుంబాలు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.

ముగ్గురు యువకుల బైండోవర్

మల్యాల: మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన కాటాపూర్‌పై అదే గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు గురువారం రాత్రి గొడ్డలితో దాడి చేసేందుకు యత్నించారు. రాత్రివేళ అక్రమంగా తన ఇంట్లోకి చొరబడి దాడికి యత్నించారని బాధితుడు రాజు శుక్రవారం ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేశారు. దాడి చేసేందుకు యత్నించిన ముగ్గురు యువకులను తహసీల్దార్ మునీందర్ ఎదుట బైండోవర్ చేశారు.

కులంపేరుతో దూషించిన వ్యక్తిపై కేసునమోదు

జగిత్యాలక్రైం: జగిత్యాల పట్టణంలోని ఎల్జీరామ్ లాడ్జి వెనుక నక్క రాజశేఖర్ అనే వ్యక్తిని కులం పేరుతో దూషించిన మెత్కూరి శంకర్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై మన్మధరావు తెలిపారు. ఈనెల 20న ఎల్జీరామ్ లాడ్జి వెనుకనున్న రిజిస్ట్రేషన్ సెంటర్ యజమాని మనోజ్‌కుమార్, మెత్కూరి శంకర్ గొడవ పడుతున్నారు. రాజశేఖర్ తాను యజమానితో మాట్లాడుతుండగా శంకర్ కులం పేరుతో దూషించాడు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు శంకర్‌పై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై తెలిపారు.

వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన

కోరుట్ల: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉర్దూ మీడియం విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యక్తిత్వ వికాస నిపుణుడు మహమ్మద్ ముజాహిద్ అవగాహన కల్పించారు. వ్యక్తిత్వ వికాసం మన శరీరం, మనసుకి అభివృద్ధిలో కీలకపాత్ర వహిస్తుందన్నారు. విద్యార్థులు తమ జీవితంలో ఉన్నత లక్ష్యాలను చేరుకోవటానికి ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, సమయపాలన తప్పనిసరి అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గౌసుర్ రహమాన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నాక్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మల్యాల: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్‌లో నిరుద్యోగ యువకులకు నెలరోజుల ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సహాయ సంచాలకులు జి.రమేశ్ తెలిపారు. 18–35 ఏళ్ల వయస్సున్న నిరుద్యోగ యువకులు ల్యాండ్ సర్వేయర్, సూపర్‌వైజర్, ఎలక్ట్రికల్ వర్కర్లలో మూడు నెలలు ఉచిత శిక్షణ అందించి, ప్రైవేట్ రంగంలో ఉద్యోగం సైతం కల్పిస్తామని పేర్కొన్నారు. శిక్షణకాలంలో ఉచిత భోజన వసతి కల్పిస్తామని, ఆసక్తిగల నిరుద్యోగ యువకులు ఎస్ఎస్సీ మెమో, కుల ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, బ్యాంక్ ఖాతాతోపాటు ఆరు పాస్‌పోర్టుసైజు ఫోటోలతో ఈ నెల 28 వరకు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 9985993168 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నేడు పెగడపల్లి సొసైటీ సమావేశం

పెగడపల్లి: పెగడపల్లి సొసైటీ సాధారణ సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు ఏర్పాటు చేసినట్లు సంఘం సీఈవో తడుకపల్లి గోపాల్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.